## బీఆర్ఎస్‌లోకి చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పెనుబల్లి, నవంబర్ 4: గణేశ్‌పాడులో పలు పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో శుక్రవారం రాత్రి చేరారు. వారికి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గులాబి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత యువత చేరగా వారికి ఆయన బీఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావు, మందడపు అశోక్‌కుమార్, గోదా చెన్నారావు, లగడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరం విజయవంతం

కల్లూరు, నవంబర్ 4 : ఎర్రబంజరలో పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని పశువైద్యురాలు మమత ప్రారంభించి పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. ఆమె మాట్లాడుతూ శీతాకాలంలో పశువులు ఎక్కువగా ఎదకు వస్తుంటాయని..ఎదలక్షణాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. శిబిరంలో వీఎల్‌వో శ్రీనివాస్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, గోపాలమిత్రలు బి.వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, హనుమంతు, పి.వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్, అప్పారావు, శివకృష్ణ, మాధవి, గ్రామరైతులు పాల్గొన్నారు.

## కలుషిత నీటి వల్ల చేపలు మృతి



మృతి చెందిన చేపలను చూపుతున్న సొసైటీ సభ్యులు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 4 : కలుషిత నీటివల్ల చేపలు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కిష్టారంలోని పెద్దచెరువులో చోటుచేసుకున్నది. దీనికి సంబంధించి సొసైటీ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిష్టారంలోని పెద్దచెరువులో మత్స్య సహాయ సహకార సంఘం బాధ్యులు చేప పిల్లలను చెరువులో పెంచుతున్నారు. గత ఏడాది ఆగస్టులో 3లక్షల రూపాయలతో 6 లక్షల చేపపిల్లలను చెరువులో పోశారు. సింగరేణి బ్లాస్టింగ్ వల్ల వచ్చిన నీరు చెరువులోకి వదలడంతో సుమారు 3 టన్నుల చేపలు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని సభ్యులు వాపోయారు.

## ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

### 25న అరుణాచల గిరిప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సు

### ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి



డీ ఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి టౌన్, నవంబర్ 4 : కార్తీక మాసం సందర్భంగా సత్తుపల్లి డిపో నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అరుణాచలం, శబరిమలైకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అరుణాచలగిరి ప్రదక్షిణ కోసం ఈ నెల 25న సత్తుపల్లి నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి 28వ తేదీన సత్తుపల్లి చేరుకుంటుందన్నారు. శ్రీ కాళహస్తి, కాణిపాకం దేవాలయాల సందర్శనానంతరం అరుణాచల గిరి ప్రదక్షిణ చేసుకుని తిరుగు ప్రయాణంలో శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్ దర్శనానంతరం సత్తుపల్లి చేరుకుంటుందన్నారు. భక్తులు ముందస్తు రిజర్వేషన్ కోసం 99599 సర్వీ నెంబర్‌తో రిజర్వేషన్ చేయించుకోవాలని ఆమె సూచించారు. శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం 35 సీట్లతో కలిగిన సూపర్ లగ్జరీ బస్సు కిలోమీటరుకు రూ.65తో ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ నుంచి కేపీహెచ్‌బీ, బాలానగర్, బోయినపల్లి, జేబీఎస్, తార్నాక, ఉప్పల్, ఎల్బీనగర్ మీదుగా సత్తుపల్లి చేరుకునే విధంగా బస్సులు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# గడపగడపకూ గులాబీ దండు

- నియోజకవర్గంలో బీఆర్ఎస్ జోరు
- ఎమ్మెల్యే సండ్రకు జననీరాజనం
- ప్రచార ఖర్చుల కోసం తమ శక్తి మేరకు ఇస్తామంటున్న ప్రజలు







ఎమ్మెల్యే సండ్రకు లింగపాలెంలో ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు, దివ్యాంగుడితో ఎమ్మెల్యే సండ్ర

వేంసూరు, నవంబర్ 4: సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది. గులాబీ దండు గడపగడపకూ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి, అందించిన సంక్షేమ పథకాల గురించి నాయకులు,కార్యకర్తలు వివరిస్తున్నారు. ఇదే క్రమంలో గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. మండలంలోని లింగపాలెంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు ఆయనకు బొట్టు పెట్టి హారతులు పట్టారు. మర్లపాడు, అమ్మపాలెం, భీమవరం గ్రామాల్లో కూడా ప్రజలు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార ఖర్చుల నిమిత్తం తామంతా తమ శక్తి మేరకు నగదును అందజేస్తామని అంటున్నారు. ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమించానని గుర్తుచేశారు. గడిచిన పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించానని వివరించారు. తనను మరోసారి గెలిపించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పగుట్ల వెంకటేశ్వరరావు, గొర్ల సంజీవరెడ్డి, పాల వెంకటరెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు హారతి ఇచ్చి బొట్టు పెడుతున్న మహిళ

# బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం





సత్తుపల్లి రూరల్ : కొత్తూరులో ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, పెనుబల్లి : వీ.ఎం.బంజరలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ లక్కినేని అలేఖ్య, కార్యకర్తలు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 4 : కొత్తూరు పంచాయతీలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఇంటింటికి అందించి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య చేసిన అభివృద్ధిని వివరించి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఒగ్గు శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తం, ఒగ్గు జగ్గారెడ్డి, దేశిరెడ్డి కృష్ణారెడ్డి, భీమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మందపాటి సోమిరెడ్డి, ఐనంపూడి సత్యనారాయణ, జగ్గవరపు వెంకటరెడ్డి, గొర్లమారి సంజీవరెడ్డి, బాలమర్తి వేణు, కొలికపోగు ప్రసాద్, షేక్ ఖాసీం, రవి, కొండూరి ప్రతాప్ పాల్గొన్నారు.

పెనుబల్లి, నవంబర్4: వీ.ఎం.బంజరలో ఎంపీపీ లక్కినేని అలేఖ్య ఆధ్వర్యంలో శనివారం గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే సండ్ర ఎంతో కృషి చేశారని, నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే సండ్రను గెలిపించాలని కోరారు.



తల్లాడ :మిట్టపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

తల్లాడ, నవంబర్4: మిట్టపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు గడపగడపకు తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ శనివారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యను కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కొండపల్లి శేకర్‌బాబు, నాగులు, రాంబాబు, కొప్పెల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూసుకుపోతున్న సండ్ర

సత్తుపల్లి టౌన్, నవంబర్ 4 : బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోపక్క ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి ఖరారు కాకపోవడంతో ఆ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ఎమ్మెల్యే సండ్ర నాలుగంచెల ప్రచార కార్యక్రమానికి ప్రణాళిక వేసుకుని ఇప్పటికే మొదటివిడత పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పేరున నియోజకవర్గం మొత్తం ఒక విడత చుట్టివేశారు. మరో విడత ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసుకుని ప్రతి మండల కేంద్రంలో కార్యకర్తలను కలుసుకున్నారు. మూడో విడత ప్రచార కార్యక్రమంలో భాగంగా తల్లాడ, పెనుబల్లి, కల్లూరు, వేంసూరు, సత్తుపల్లి మండలాల్లోని గ్రామాల్లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ముద్రించి లక్ష మంది ఓటర్లకు కలవడమే లక్ష్యంగా పెట్టుకుని కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. నాల్గవ విడతగా సిద్ధం చేసుకున్న ప్రచార రథానికి శుక్రవారం పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. శనివారం వేంసూరు మండలంలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే సండ్రకు ప్రతి గ్రామంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది.



ప్రచార రథంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర (ఫైల్)

## అక్రమ మద్యం పట్టివేత

సత్తుపల్లి రూరల్, నవంబర్ 4 : ఎన్నికల నిబంధలు పాటించని బెల్టుషాపులపై శనివారం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు దాడులు నిర్వహించారు. బుగ్గపాడు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న మాపకుంట్ల రాఘవయ్య దుకాణంలో దాడులు చేసి సుమారు 22.5 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని రాఘవయ్యను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

## సత్తుపల్లిలో తొలి నామినేషన్

సత్తుపల్లి టౌన్, నవంబర్ 4 : సత్తుపల్లిలో ఎన్నికల కార్యాలయం వద్ద శనివారం తొలి నామినేషన్ దాఖలైంది. రెండో రోజు అలయన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక చక్రవర్తికి శనివారం సమర్పించారు. రెండోరోజు ఒక్క నామినేషన్ దాఖలైనట్లు అధికారి తెలిపారు.